www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 10 జనవరి 2025
5
పశ్చిమ గోదావరి

నేటి నుంచి జాతీయస్థాయి నాటక పోటీలు

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 10వ తేదీ నుండి శ్రీకృష్ణదేవరాయ నాటక కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో జాతీయస్థాయి నాటక పోటీలను రాయకుదురులో నిర్వహిస్తున్నట్లు ఆ కళాపరిషత్ అధ్యక్షుడు కెఎస్ఆర్కె.గోపాలకృష్ణ గురువారం తెలిపారు. ఈ పోటీలను మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామన్నారు. 10న అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం, షిర్డీసాయి కల్చరల్ ఆర్ట్స్ అనకాపల్లి వారి మలిసంధ్య ప్రదర్శన ఉంటాయని వివరించారు. 11న నటీనటుల సమాఖ్య పాలకొల్లు వారి అనుహ్యాం, శార్వాణీ ఆర్ట్స్ బోరివంక వారి కొత్త పరిమళం ప్రదర్శన ఉంటాయన్నారు. 12న అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి, చైతన్య ఆర్ట్స్ ఉక్కు నగరం వారి అసత్యం నాటిక ప్రదర్శనతోపాటు ముగింపు సభ, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు.

ఎదురుచూపులేనా..!

ఏడు నెలలైనా అమలు కాని కీలక హామీలు
అమ్మకు వందనం, అన్నదాత సుఖీభవ ఎప్పుడో..?
18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500,
నిరుద్యోగ భృతిపై సర్వత్రా చర్చ
చంద్రన్న బీమా అమలుపైనా నిర్లక్ష్యమే
సంక్రాంతి కానుకకు తిలోదకాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు ఎదురుచూపులే మిగులుతున్నాయి. సూపర్ సిక్స్ పేరుతో కూటమి ఇచ్చిన కీలక హామీలకు సైతం అధికారం చేపట్టి ఏడు నెలలు గడిచినా మోక్షం లేని పరిస్థితి ఉంది. పథకాలకు పేర్లు ప్రకటించడమే తప్ప.. అమలు మాత్రం ముందుకు పడటం లేదు. కూటమి మేనిఫెస్టో హామీలపై ప్రజల్లో తీవ్ర చర్చ సాగుతోంది. గత ప్రభుత్వం పథకాల అమలు తీరుపైనా, ప్రస్తుత ప్రభుత్వం తీరుపై జనాల్లో చర్చ పెద్దఎత్తున సాగుతోంది. హామీల అమలులో తాత్సారంతో రైతులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 16 లక్షల వరకూ సాగుభూమి ఉంది. దాదాపు ఎనిమిది లక్షల మంది రైతులు వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్నారు. వ్యవసాయం కష్టాల సాగుగా మారడంతో ప్రభుత్వ సాయం రైతులకు ముఖ్యంగా మారింది. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఏడు నెలలు గడిచిపోయింది. ఖరీఫ్ పూర్తయ్యింది. రబీ ముమ్మరంగా సాగుతోంది. పెట్టుబడి సాయం మాత్రం అందలేదు. రైతులకు అత్యంత ముఖ్యమైన హామీని సైతం సకాలంలో అమలు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కౌలుచట్టంలో మార్పులు చేస్తామనే మాటను సైతం ప్రభుత్వం ఇప్పటికీ నెరవేర్చలేకపోయింది. ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదవుతున్న కుటుంబంలోని ఒక విద్యార్థికి గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఏడాదికి రూ.15 వేలు జమ చేసింది. తాము అధికారంలోకి వస్తే కుటుంబంలో చదువుకుంటున్న ప్రతి పిల్లాడికీ అమ్మకి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని కూటమి నేతలు చెప్పారు. ఇప్పటి వరకూ అమలు కాలేదు. జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న విద్యార్థులు ఐదు లక్షలకుపైగా ఉన్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుతోంది. ప్రయివేటు స్కూళ్లలో ముక్కుపిండి ఫీజు వసూలు చేస్తున్నారు. అమ్మకు వందనం సొమ్ములేస్తే పిల్లల ఫీజులకు ఉపయోగపడతాయని తల్లిదండ్రులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎప్పుడు వేస్తారో కనీసం ప్రకటించని పరిస్థితి నెలకొంది. 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1500 జమ చేస్తామని చెప్పారు. అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ఉద్యోగాలు వచ్చే వరకూ యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.మూడు వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అసలు అమలు చేస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మాటలు తప్ప ఆచరణ లేకుండాపోయింది. సూపర్ సిక్స్ పేరుతో ప్రభుత్వం చెప్పిన కీలక హామీల్లో ఉచిత గ్యాస్ పథకం ఒక్కటే ఇప్పటి వరకూ అమలు చేసిన పరిస్థితి నెలకొంది.



చంద్రన్న బీమాపైనే నిర్లక్ష్యం

ఇంట్లో కుటుంబ యజమాని మృతి చెందితే ఇచ్చే చంద్రన్న బీమా సైతం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణానికి రూ.పది లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. బీమా అంటే కష్టకాలంలో ఉపయోగపడేదని అర్థం. కుటుంబ యజమానిని కోల్పోయి ఎన్నో కుటుంబాలు దుర్భర స్థితిని అనుభవిస్తున్నాయి. ఈ ఏడు నెలల కాలంలో వందల కుటుంబాలు కుటుంబ పెద్దను కోల్పోయి కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వారి పిల్లల చదువులకు, బతుకు సవ్యంగా సాగాలనే బీమా సొమ్ములు ఆధారంగా ఉంటాయి. పథకానికి పేరు ప్రకటించినా అమలు కాని పరిస్థితి నెలకొంది.

సంక్రాంతి కానుక తిలోదకాలు

2014-19 మధ్యలో టిడిపి ప్రభుత్వం సంక్రాంతి కానుక కింద నిత్యావసర సరుకులకు అందించింది. గత వైసిపి ప్రభుత్వం దీన్ని నిలిపివేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్రాంతి కానుక ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. మరో నాలుగు రోజులు సంక్రాంతి పండుగ రానుంది. సంక్రాంతి కానుక ఊసే లేకుండాపోయింది. ముఖ్యమైన పథకాల అమలులోనూ ప్రభుత్వం తాత్సారం వహిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలివే..

1.యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.మూడు వేల నిరుద్యోగ భృతి
2.స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు
3.ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
4.ప్రతి మహిళకు నెలకు రూ.1500 (19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకూ)
5.ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు
6.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
వీటిలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ఒక్కటే అమల్లోకి వచ్చింది.

బొమ్మల కొలువును ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును కలెక్టర్ నాగరాణి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించడాన్ని ప్రశంసించారు. కోలం ముగ్గులు, బొమ్మల కొలువు అలంకరణలను పరిశీలించి బాగుందని కితాబిచ్చారు. ఈ అలంకరణలో పాల్గొన్న మహిళా సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగువాళ్ల అతి పెద్ద పండుగ సంక్రాంతి అని అన్నారు. బుద్ధిని వృద్ధి చేసుకోవడం అనేది సంక్రాంతి పండుగలోని ఆంతర్యమన్నారు. గురువారం మధ్యాహ్నం సంక్రాంతి వంటలైన క్షీరాన్నం, కొబ్బరి అన్నం, చింతపండు పులిహోర, పెరుగు ఆవడ, అరిసెలు, బూరెలు, గారెలు, బొబ్బట్లు, కాజాలు, సున్నుండలు, లడ్డూలు పూతరేకులు, కజ్జికాయలు, జంతికలు, అప్పడాలు, ఉలవచారు, పచ్చిపులుసు, రోటి పచ్చడి మొదలైన పిండివంటలను సిబ్బంది స్వయంగా తయారు చేసి ఆహుతులకు సంక్రాంతి విందును ఏర్పాటు చేశారు. తొలుత నిర్వహించిన వంటలు, ముగ్గులు, క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో జిల్లా ట్రెజరీ అధికారి ఆడారి గణేష్, సహాయ ట్రెజరీ అధికారి అబ్దుల్ హకీం, ఎస్‌టిఒలు జె.రామారావు, ఇ.హిమబిందు, ఎ.రవివర్మ, పి.హరిబాబు, ఎవి.శివాజీ, ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షులు యువి.పాండురంగారావు, సీనియర్ అకౌంటెంట్లు జె.మౌనిక, జ్యోతి, పి.వినీల, పి.విశాలి, జి.చంద్రశేఖర్‌రావు, సాయిబాలాజీ, ఎ.శ్రీనివాసరావు, ఎం.జగదీశ్వరరాజు, ఎం.సత్యనారాయణ, ప్రసాద్‌బాబు, భాస్కర్, శోభన్, సూర్యనారాయణ, అంజమ్మ, పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు, జిల్లా దేవాదాయ శాఖాధికారి ఇ.సుబ్బారావు, బిసి వెల్ఫేర్ అధికారి గణపతిరావు, డిఎంహెచ్ఒ భానునాయక్, ఐసిడిఎస్ పీడీ సుజాతరాణి పాల్గొన్నారు.

ఆ పంచాయతీలపై విచారణకు ఆదేశం

ఏలూరు డిపిఒ కె.అనురాధ - 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

క్రొవ్విడి, మందలపర్రు, గుణపర్రు పంచాయతీల వెండర్ ఖాతాల్లో జరిగిన బిల్లుల చెల్లింపులపై విచారణకు ఆదేశించినట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ తెలిపారు. గురువారం 'పంచాయతీల్లో వెండర్ మాయాజాలం' అంటూ నిడమర్రు మండలం క్రొవ్విడి, మందలపర్రు, గుణపర్రు పంచాయతీలపై 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి అమె స్పందించారు. దీనిపై ఏలూరు డిఎల్‌పిఒ కెపి.చంద్రశేఖర్ విచారణ చేసి నివేదిక ఇస్తారన్నారు. విచారణలో తప్పు చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డిపిఒ తెలిపారు.

గూడెంలో నేడు 'డయల్ యువర్ డిఎం'

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం పరిసర ప్రాంత ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల పదో తేదీ శుక్రవారం సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల నుంచి ప్రయాణ, కార్గో సర్వీసుల్లో సమస్యలు, సలహాలు, సూచనలను 9959225488 నెంబరుకు డయల్ చేయాలని డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు.

లోసరిలో కోడి పందేలు ఆపండి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సంక్రాంతి పేరుతో లోసరిలో ప్రతియేటా నిర్వహిస్తున్న కోడిపందేలను ఆపాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతియేటా తమ గ్రామంలో కొందరు కోడిపందేలు నిర్వహిస్తున్నారని భీమవరం మండలం లోసరి గ్రామానికి చెందిన కొప్పినేటి రామలక్ష్మి ఆధ్వర్యంలో పది మంది మహిళలు హైకోర్టును ఆశ్రయించడంతో ఈ మేరకు హైకోర్టు ఈ నెల ఎనిమిదో తేదీన ఉత్తర్వులిచ్చిందని రామలక్ష్మి కుమారుడు నాగరాజు తెలిపారు. ఆయన గురువారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల కాపీని చూపారు. సంక్రాంతి పండుగ పేరుతో గ్రామంలో కోడిపందేలు, పేకాట, జూదాల పేరుతో అనేక కుటుంబాలు నాశనమవుతున్నాయని, తమ

హైకోర్టు ఆదేశాలు

గ్రామంలో కోడి పందేలు నిర్వహించొద్దని గత నెల 30న కలెక్టర్‌కు, ఎస్‌పికి రిజిస్టర్ పోస్టులో వినతులు పంపామని చెప్పారు. అయితే పందెంరాయుళ్లు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి గ్రామంలో ఎప్పటిలానే కోడి పందేలు నిర్వహించేందుకు సిద్ధం కావడంతో గ్రామ మహిళలు హైకోర్టుకును ఆశ్రయించారని తెలిపారు. పండగలో సంప్రదాయ ఆటలు మినహా ఎటువంటి జూద క్రీడలు నిర్వహించరాదని, దీనికి అవసరమైన చర్యలు రెవెన్యూ, పోలీసు అధికారులు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందని చెప్పారు.

ఆందోళనబాటలో సొసైటీ ఉద్యోగులు

డిమాండ్ల పరిష్కారానికి నేటి నుంచి దశలవారీ ఆందోళన

ప్రజాశక్తి - తణుకు రూరల్

రైతులకు ఆర్థికపరమైన సేవలందించే సొసైటీ ఉద్యోగులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనబాట పట్టారు. రైతుల సమాచారాన్ని కంప్యూటరీకరణ పేరుతో ఉద్యోగులపై ఒత్తిడి తేవడం, పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వకుండా కేవలం ఒక రోజు శిక్షణ మాత్రమే ఇచ్చి సమాచారాన్ని ఆన్‌లైన్ చేయాలనడంపై ఉద్యోగుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో తమ డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ సొసైటీ ఉద్యోగులు బుధవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. దఫదఫాలుగా తమ ఆందోళన ఉధృతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఉద్యోగ విరమణ వయస్సు ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల మాదిరిగా 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేసి అన్ని సొసైటీలకు గ్రేడులను బట్టి ఒకే రకమైన వేతనాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. డిసిసిబిలో షేరు ధనం ఆధారంగా డివిడెంట్ చెల్లించాలని, లాభాలు వచ్చినప్పటికీ దానికి తగ్గట్టుగా డివిడెంట్ చెల్లించకపోవడం కూడా మరో సమస్యగా పరిగణిస్తున్నారు. ఈ నెల 10న ఏలూరులోని డిసిసిబి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నారు. అనంతరం 20న కలెక్టరేట్ ముట్టడి, 27న విజయవాడలో రాష్ట్ర సహకార బ్యాంకు వద్ద మహా ధర్నా నిర్వహించనున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే వచ్చే నెల 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు.

సొసైటీల్లో అందుతున్న సేవలు ఇవే

రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పెట్టుబడులకు అవసరమైన రుణాలను సహకార సంఘాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా సబ్సిడీపై ఎరువులు, పంట రుణాలు, బంగారంపై రుణాలు, పాల వ్యాపారం, గేదెల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం తమ సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల సమ్మెను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాల్సి ఉంది. అలాకాకుండా ఉద్యోగులు సమ్మెలోకి వెళ్తే సొసైటీల్లో లావాదేవీలు స్తంభించి రైతులకు సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. తణుకు మండలంలో 11,267 ఎకరాల్లో 6020 మంది రైతులు రబీ సాగు చేస్తున్నారు. మార్కెట్లో యూరియా కొరత ఎదుర్కొంటున్న రైతులు సహకార సొసైటీల ఉద్యోగుల సమ్మె దీర్ఘకాలం కొనసాగితే రైతులకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.

పదిలో నూరుశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో భీమవరం డివిజన్‌స్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో కలిసి పదో తరగతి పరీక్షా ఫలితాలపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి 15వ తేదీ నుండి జరగనున్న పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు మన జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఎస్ఎ-1 పరీక్షల్లో మార్కులను అనుసరించి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకుని అమలు చేయాలన్నారు. ప్రత్యేక తరగతులు సమర్థవంతంగా నిర్వహించాలని, తూతూమంత్రంగా నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆకస్మిక తనిఖీలు చేస్తానని, బాగుంటే అభినందిస్తానని, లేదంటే తక్షణం చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. సి, డి గ్రేడు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైతే మరో అరగంటసేపు ఎక్కువగా ప్రత్యేక క్లాసులో ఉంచాలని అన్నారు. ప్రతి ప్రధానోపాధ్యాయునితో ఉత్తీర్ణతాశాతంపై ఫిజికల్ ఇంట్రాక్షన్ చేయాలని జిల్లా, మండల విద్యాశాఖధి అధికారులకు జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఆడపిల్లల రక్షణ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, వారు ఎటువంటి ఇబ్బందులకూ గురికాకుండా తీసుకోవాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనన్నారు. విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లల నుండి ఎటువంటి చిన్న ఫిర్యాదొచ్చినా వెనువెంటనే పరిష్కరించాలని, కాలయాపన చేస్తే పరిస్థితి చెయ్యి దాటిపోతుందని హెచ్చరించారు. విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తగ్గించడానికి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి సామర్థ్యాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఇ.నారాయణ, ఎస్ఎస్ఎ ఎపీసీ పి.శ్యామ్‌సుందర్, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి వై.చంద్రశేఖర్, డివైఇఒ పి.నాగరాజు, ఎంఇఒలు, హైస్కూల్ హెచ్‌ఎంలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యనారాయణరాజు సేవలు చిరస్మరణీయం

సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు

ప్రజాశక్తి - యలమంచిలి

సూర్యనారాయణ రాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చించినాడ మాజీ సర్పంచి, సిపిఎం నాయకులు రుద్రరాజు సూర్యనారాయణరాజు గ్రామానికి చేసిన సేవలు చిరస్మరణీయమని సిపిఎం సీనియర్ నేత, మాజీ సర్పంచి కేతా సూర్యారావు అన్నారు. గురువారం మండలంలోని చించినాడలో సూర్యనారాయణరాజు 19వ వర్ధంతి సభ గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. తొలుత పార్టీ పతాకాన్ని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు ఆవిష్కరించారు. అనంతరం సూర్యనారాయణరాజు విగ్రహానికి కేతా సూర్యారావుతోపాటు గ్రామ మాజీ ఉప సర్పంచి రుద్రరాజు సత్యనారాయణరాజు, సూర్యనారాయణరాజు అల్లుడు విశ్వనాథరాజు, రుద్రరాజు పెదవర్మ, రుద్రరాజు చినవర్మ, మాజీ ఉప సర్పంచి పెదబాబు, అల్లూరి రామకృష్ణంరాజు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ చించినాడ గ్రామానికి సుమారు 35 సంవత్సరాలపాటు సర్పంచిగా, 15 సంవత్సరాలపాటు సొసైటీ అధ్యక్షునిగా సేవలందించిన సూర్యనారాయణరాజు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజలందరినీ కంటికి రెప్పలా సొంత బిడ్డల్లా కాపాడుకుంటూ నీతి నిజాయతీగా మచ్చలేని మహనీయునిగా వెలుగొందారన్నారు. అలాగే సొసైటీ భవనం, గొడౌన్‌ను నిర్మించడానికి సుమారు రూ.కోటి విలువ చేసే తన సొంత స్థలాన్ని ఉచితంగా దానం చేయడంతోపాటు సొసైటీని అభివృద్ధి చేసి రైతాంగానికి, ప్రజలకు ఎంతో మేలు జరిగేలా కృషి చేశారన్నారు. అటువంటి నాయకుని ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ, చెల్లుబోయిన వడ్డికాసులు, మురాల రాజేష్, ముమ్మిడివరపు ఆంజనేయులు, శెట్టిమి భాస్కరరావు, పల్లేరు వెంకటస్వామి, తెన్నేటి శివాజీ, కేతా వాసు, ముస్కాడి జయశ్రీ పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

కాంగ్రెస్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - కాళ్ల

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షాను తక్షణం బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు డిమాండ్ చేశారు. పిసిసి పిలుపు మేరకు స్థానికంగా గురువారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంఘం అధ్యక్షులు సోడదాసి గంగయ్య, నేతలు అంకెం సీతారాం, అంబేద్కర్ యువజన నాయకులు తాళ్లూరి రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు: అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, తక్షణం ఆయన తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యాన గురువారం నిరసన చేపట్టారు. అంబేద్కర్ పాదాల వద్ద తన రాజీనామా పత్రాన్ని సమర్పించాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు యడ్ల శివాజీ డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కొలుకులూరి అర్జున్‌రావు, బోనం వెంకట్రావు, డాక్టర్ వై.నామగిరి, కె.ప్రభుదాస్, యలమర్తి మోహనరావు పాల్గొన్నారు.

నరసాపురం: డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పోలిశెట్టి వివి నారాయణస్వామి (బాబ్జి) స్థానిక బస్టాండ్ సెంటర్లో ధర్నా చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గాదిరెడ్డి వనమయ్య, కామన ధనుంజయ పాల్గొన్నారు.

పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతల ఆందోళన

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - తణుకు

పెరుగుతున్న ధరలకనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అమరవీరుల భవనంలో పట్టణంలోని కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ నేడు కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారినా కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పులూ లేకపోవడం బాధాకరమన్నారు. పాలకులకు ప్రజలపై భారాలు వేయడంపై ఉన్న శ్రద్ధ, కార్మికులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచడంలో లేదని విమర్శించారు. చాలా పరిశ్రమలు, సంస్థల్లో షాపింగ్ మాల్స్‌లో పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యూటీ, బోనస్, పర్మినెంట్ వంటివి అమలు కావడం లేదని తెలిపారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేసి పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్.ఆదినారాయణబాబు, గుబ్బల గోపి, రమేష్, బాలాజీ, రమణ, భాస్కరరావు, సత్యనారాయణ, రాము, శ్రీనివాస్, సూరిబాబు, తిరుపతి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ ఆహ్వానం

ప్రజాశక్తి - భీమవరం

కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ కార్యవర్గం కలిసి మావుళ్లమ్మ అమ్మవారు 61వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా భీమవరం పట్టణం నడిబొడ్డున నెల రోజుల పాటు మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 13 నుండి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ నిర్వహించనున్న నేపథ్యంలో అమ్మవారి ఆలయ దర్శనానికి స్థానికులు కాకుండా, దూర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున యాత్రికులు వస్తారని తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చేవారికి ఎటువంటి అసౌకర్యం చూడాలని కలగకుండా అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ కార్యవర్గం సభ్యులకు సూచించారు. ఆహ్వాన పత్రం అందజేసిన వారిలో మావుళ్లమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ కార్యవర్గం అధ్యక్షులు రామాయణం గోవిందరావు, ఉపాధ్యక్షులు కొప్పుల సత్యనారాయణ (సత్తిబాబు), కార్యదర్శులు కొప్పుల రంగారావు, రామాయణం సత్యనారాయణ, నరహరిశెట్టి సూర్యనారాయణ, రామాయణం శ్రీనివాసరావు, ఆకుల సోమేశ్వరరావు, కొప్పుల రాంబాబు, మానే భాస్కరరావు, మానే తేజ సురేష్, కోశాధికారి రామాయణం సత్యనారాయణ పాల్గొన్నారు.

నరేష్‌కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - పెనుమంట్ర

మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు నక్కా నరేష్ కుమార్‌కు నూతన సంవత్సర సెలబ్రేషన్స్ సందర్భంగా గుడ్ సమరియన్ థియోలాజికల్ సెమినార్ ఇంటర్నేషనల్ ఇన్‌ఛార్జి 'మనం' ఫౌండేషన్ ఆధ్వర్యంలో హ్యుమానిటీస్, గ్లోబల్ శాంతిలో డాక్టరేట్, ట్రాన్స్‌లేషన్ లీడర్షిప్ డిగ్రీలో పట్టా అందజేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో ఫౌండర్ అండ్ డైరెక్టర్ కె.చక్రవర్తి సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్ పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నో విలువైన సేవలను సంస్థ ద్వారా చేస్తున్నందుకు 'మనం' ఫౌండేషన్ సంస్థ అధినేత కె.చక్రవర్తి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. నరేష్ కుమార్‌కు డాక్టరేట్ రావడం పట్ల మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కర్రి మురళీ శ్రీనివాస్ రెడ్డి, వ్యవస్థాపకులు జుత్తిగ, అంతర్జాతీయ అవార్డు గ్రహీత సాకా ప్రసాద్ వంటి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే నవీన నందన కుమార్, సంధి జాన్సన్, పెదపాటి సురేష్ బాబు, సాకా రవి, పమ్మి చంద్రరావు, పమ్మి ఏసు, పమ్మి రాజు, నెల్లి శ్రీనివాస్, మరికొంతమంది అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

డాక్టరేట్ అందుకుంటున్న నక్కా నరేష్ కుమార్

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

ప్రజాశక్తి - ఆచంట

ఉపాధి హామీ కూలీలకు కొలతల ప్రకారం రోజుకు రూ. 300 వచ్చే విధంగా పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని కాకినాడ క్లస్టర్ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎవిఎస్ఎవి.ప్రసాద్ అన్నారు. ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు గురువారం శిక్షణ కార్యక్రమం ఆచంట మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఆచంట, ఇరగవరం, పెనుగొండ మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు 48 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో జనవరి నుండి జూన్‌నెల వరకూ పనిదినాలు ఇవ్వడం జరిగింది. ఈ లక్ష్య సాధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కనీస వేతనం రూ.300 వచ్చే విధంగా, కొలతల ప్రకారం పని విధంగా పని చేయించాలని అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ పూర్ణబాబ్జి మాట్లాడుతూ ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కె.శ్రీను, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రవీణ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రామచంద్రరావు, పోసి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల స్థానిక సమస్యల పరిష్కారం కోసం అందించే అర్జీలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి చూపాలన్నారు. సమస్యను సమగ్రంగా పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజల నుంచి అందిన అర్జీల్లో సమస్యపై చర్చించి పరిష్కార చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, పాత్రుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో జెసి దంపతులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి దంపతులు భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి వెంకటేశ్వర స్వామి వారిని గురువారం దర్శించుకున్నారు. జెసి దంపతులను ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. మందిర అధ్యక్షులు కాంతేటి వెంకటరావు, కుక్కల బాల, చెరుకువాడ రంగసాయి, జానపాటి మధు, సరిపిడకల రామారావు, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహనా సదస్సు

గణపవరం:దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి జ్వరాలు వస్తాయని మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.లక్ష్మణరావు అన్నారు. గురువారం గణపవరం రెండో సచివాలయం పరిధిలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో మలేరియాపై జరిగిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో తడి లేకుండా చేసుకొని పాడైన ఉంచుకోవడం వల్ల దోమలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ డి.అశ్విరాణి, ఎఎన్ఎంలు ఆర్.రమాదేవి, ఎ.కృష్ణ, కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు యోహాన్ పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో మెగా ట్రావెల్స్ ఎక్స్‌పో-25

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం జెపి రోడ్డులోని శ్రీకృష్ణ ట్రావెల్స్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో మెగా ట్రావెల్ ఎక్స్‌పో-25 నిర్వహిస్తున్నట్లు ఎస్‌కె ట్రావెల్ ప్రొప్రైటర్ పేరిచర్ల కృష్ణంరాజు తెలిపారు. స్థానిక జువ్వలపాలెం రోడ్డులో ఉన్న ఆయన కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ట్రావెల్ ఎక్స్‌పో అతి తక్కువ డొమెస్టిక్, ఇంటర్నేషనల్, థామస్ కుక్ గ్రూప్ ప్యాకేజీలకు సంబంధించిన వివరాలను అందించి వారికే నేరుగా అవకాశాన్ని కల్పిస్తామన్నారు. ఫ్లైట్ టికెట్స్, ఫ్యామిలీ ప్యాకేజ్, హోటల్ బుకింగ్, పాస్‌పోర్ట్, ట్రావెల్ ఇన్సూరెన్స్, వీసా అసిస్టెన్స్ వంటి ఎన్నో సదుపాయాలను అందిస్తున్నామని తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ మెగా ట్రావెల్ ఎక్స్ పో-25ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం

తాడేపల్లిగూడెం:ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక పదం కుమార్ గుప్త వాకర్స్ భవన్‌లో గురువారం జరిగింది. అధ్యక్షునిగా తిరుమల సూరిబాబు, సెక్రెటరీగా అల్లూరి శ్రీనివాస్, కోశాధికారిగా మల్లాడి సారథి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పూర్వ అధ్యక్షుడు దూలం నాగరాజు గత సంవత్సరంలో అసోసియేషన్ చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. నూతన అధ్యక్షులు సూరిబాబు మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతను సభ్యుల సహకారంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి శాయ శక్తులా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్, తోట రాజా నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు వెంకట కృష్ణారావు, రాజేంద్ర, కప్పల నరసింహమూర్తి, జిఎంఆర్ సంస్థల ప్రెసిడెంట్ గ్రంధి సత్యనారాయణ పాల్గొన్నారు.

15 వరకూ ఫసల బీమా యోజన గడువు పెంపు

నరసాపురం:ప్రధానమంత్రి ఫసల బీమా యోజన పథకం గడువు ఈ నెల 15వ తేదీ వరకూ ప్రభుత్వం పెంచినట్లు వ్యవసాయశాఖ ఎడిఏ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం సదస్సులో రైతులకు ఇన్సూరెన్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఇంకా ఇన్సూరెన్స్ చెల్లించని వరిలో గడువులోగా చెల్లించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం లేదా అధిక ప్రకృతివి ప్రమాదాల వల్ల పంటకు నష్టం వాటిల్లితే రైతులకు తగిన బీమా పరిహారం అందించనున్నట్లు తెలిపారు. రైతులు ఎకరాకు రూ.615 చొప్పున ప్రీమియం చెల్లిస్తే ఎకరాకు రూ.41,000 ప్రీమియం చేయబడుతుందన్నారు. కౌలు, సొంత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను సంప్రదించి ఇ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

పాలకొల్లు రూరల్, పోడూరు : పోడూరు మండలం కవిటంలో వరి పొలాలను మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ గురువారం పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడుతూ అందరూ ఇ - పంట నమోదు చేయించుకోవాలన్నారు. దగ్గరలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి, పసల బీమా యోజన పథకం నమోదు చేయించుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకూ గడువు పెంచినట్లు తెలిపారు. కట్టిపాలు ప్రతి రైతు దగ్గరలోని సిఎస్‌సి సెంటర్, పోస్టాఫీసుల ద్వారా దాల్వా పంటకు సంబంధించిన ప్రధానమంత్రి పసల్ బీమా యోజన ప్రతి ఎకరానికి 615 రూపాయలు చొప్పున చెల్లించి బీమా సౌకర్యం పొందాలని కోరారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814


తణుకు ఎస్‌కెఎస్‌డిలో విద్యార్థినుల వేషధారణలు

భీమవరం విష్ణులో సంక్రాంతి సంబరాలు

నరసాపురం: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

విద్యాసంస్థల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

గణపవరం డిగ్రీ కాలేజీలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ బివి.రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విష్ణు స్కూల్ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. ఫౌండేషన్ ఛైర్మన్ కెవి విష్ణు రాజు హాజరై సంబరాలను తిలకించారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యకలాపాలతో పాటు సంక్రాంతిని ప్రతిబింబించే రంగవల్లులు, గొబ్బెమ్మలు, కోలాటం, భోగిపళ్లు, వివిధ కళారూపకాలు, హరిదాసులు, కొమ్ముదాసులు, సోదమ్మ, పిట్టలదొర వేషధారణలు ఆకట్టుకున్నాయి. విష్ణు విద్యా సంస్థల ఛైర్మన్ కెవి.విష్ణురాజు మాట్లాడుతూ సంప్రదాయ బద్ధమైన ఏ అంశమైనా రాబోయే తరాలకు ఉన్నతమైన ఆరోగ్యాన్ని, మంచి ఆలోచనా శక్తిని అందించే ఉద్దేశంతో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ జె.ప్రసాద్‌రాజు, డైరెక్టర్ ఫర్ స్టూడెంట్ అఫైర్స్ అండ్ అడ్మిన్ పి.శ్రీనివాస్‌రాజు, డిజిఎం.రమేష్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్ సివి రామన్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి సంబరాలు మన సంస్కృతికి చిహ్నాలని ప్రాచీన కళా వైభవాన్ని తెలుపుతూ సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమని ఆర్‌టిసి డిపో మేనేజర్ పిఎస్ఎస్.సత్యనారాయణ మూర్తి అన్నారు. గురువారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సర్ సివి రామన్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ స్కూళ్లలో సంక్రాంతి సంబరాలను నిర్వహించాడం గొప్ప విశేషమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను వివిధ పాఠశాలల్లో వారం రోజులుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, పోస్టల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. ప్రతిభ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం నిర్వహించారు. బొమ్మల కొలువు, ఫుడ్ ఫెస్టివల్, చిన్నారులకు భోగి పండ్లు పోయడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలతో సంబరాల్లో పాల్గొన్నారు. విద్యార్థుల హరిదాసు, బసవన్న తదితర వేషధారణలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఆయా పోటీలను నాయకర్ తిలకించారు. విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయని ఎంఎల్‌ఎ తెలిపారు. బాగా చదువుకుని పాఠశాలకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమాలను ప్రిన్సిపల్ మాలే సుష్మా, అడ్డాల కోదండ సాయికుమార్, ముక్కు నాగమణి, పులకండం అనంతలక్ష్మి, బెల్లంకొండ సత్యనారాయణ, పద్మనాభుని నగేష్ పర్యవేక్షించారు. పాఠశాల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు ముగ్గులు వేసి, బొమ్మల కొలువుల ఆటలు పాటలతో సంబరంగా గడిపారు. విద్యార్థుల గంగిరెద్దు, బుడబుక్కలోడు, పిట్టలదొర, హరిదాసు వంటి వేషధారణలు ఆకట్టుకున్నారు. చివరిగా భోగిమంటలతో సంబరాలు పూర్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం:గణపవరం డిగ్రీ కాలేజీలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ సకల సౌభాగ్యాలను కలుగజేసే రైతన్నను మర్చిపోకూడదని తెలిపారు. రైతులు కష్టాన్ని గుర్తు పెట్టుకుని వారిని అన్నిరకాలుగా ఆదరించాలన్నారు. సంబరాల్లో భాగంగా భోగి మంటను

మొగల్తూరులో..

ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ రెండో పిఒ భాస్కరరావు భోగి మంటల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం జరిగిన ఆటలు పోటీల్లో గెలుపొందిన వారికి ప్రిన్సిపల్ నిర్మలాకుమారి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు సిహెచ్ చైతన్య, టి.అక్కిరాజు, కె.స్వరూపరాణి, కెవి.గణేష్‌కుమార్, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

కాళ్ల : మన సంస్కృతీ, సంప్రదాయాలను ఎప్పటికీ మరువరాదని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.నిర్మలాదేవి అన్నారు. కోపల్లె హైస్కూల్లో ఉన్నత పాఠశాల, ఐక్య నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికలకు సాంప్రదాయ దుస్తుల పోటీలు, బాలికలకు ముగ్గుల పోటీలు, ఫ్యాన్సీడ్రెస్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించారు. ఐక్య నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ ఆచారి, కన్వీనర్ స్వామి, జివి డాక్టర్ కృష్ణంరాజు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ కె.సుబ్బరాజు, స్టాఫ్ సెక్రటరీ మాణిక్యాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట : మరుగున పడుతున్న ఆచారాలను, వేడుకలను జాగృతి పర్చడంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఇఒ ఎ.ఉషారాణి అన్నారు. గురువారం ఆచంట జెడ్‌పి ఉన్నత పాఠశాల, కొడమంచిలి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, కరుగోరుమిల్లి, భీమలాపురం, పెదమల్లం, కోడేరు, కందరవల్లి, అయోధ్యలంక గ్రామాల్లో విద్యార్థులు భోగి మంటలు వేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు అందర్నీ ఆకట్టుకున్నాయి. తహశీల్దార్ కనకరాజు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పూర్ణ బాబ్జి, ఎంఇఒ-2 పి.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసాపురం : సంస్కృతీ, సంప్రదాయాలను నేటితరానికి తెలియజేయాలని తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి అన్నారు. యర్రంశెట్టివారి పాలెం జెడ్‌పి హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు స్కూల్ ప్రాంగణంలో రంగురంగుల ముత్యాల ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు తహశీల్దార్ రాజరాజేశ్వరి, మాజీ ఎఎంసి వైస్ ఛైర్మన్ యర్రంశెట్టి బాబులు, స్కూల్ ఛైర్మన్ మురళీకృష్ణ బహుమతులు అందించారు. అనంతరం యర్రంశెట్టి బాబును తహశీల్దార్ సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోళ్లపర్తి శ్రీనివాసరావు, సుబ్బారావు, అరుణ, ఉపసర్పంచి వాసు, వైఎస్ హరి పాల్గొన్నారు.

ఆచంట : సాంప్రదాయ వేషధారణలో విద్యార్థులు

నరసాపురం : పట్టణంలోని బిజిబిఎస్ మహిళా కళాశాలలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ పోటీల్లో 100 మంది విద్యార్థులు పాల్గొని ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు బహుమతులందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కంచర్ల బాబ్జి, కోశాధికారి కోట్ల బాలకృష్ణ, ప్రిన్సిపల్ కె.మధుశాలిని పాల్గొన్నారు.

తణుకు : సంస్కృతీ, సాంప్రదాయాలను తెలిజేసే పండుగ సంక్రాంతి అని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి అన్నారు. ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తొలుత కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యఉషారాణి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భోగిపళ్లు, భోగిమంటలు, గొబ్బిళ్లు, కోలాటం, విద్యార్థినుల సంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బిహెచ్ హిమబిందు, అధ్యాపక, అధ్యాపకేతం పాల్గొన్నారు.

వివేకానంద గ్లోబల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. పిల్లలు, గోదాదేవి, హరిదాసులు, సోదమ్మ వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనాసాయి, స్కూల్ హెచ్‌ఎం రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

మన సంస్కృతీ, సంప్రదాయాలు నేటి యువతరానికి అందించాలని మాజీ వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ వావిలాల సరళాదేవి అన్నారు. ఇంపల్స్ కాలేజీలో సరళాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడారు. ఈ సందర్భంగా సాంప్రదాయ వస్త్రధారణ, వంటలు, ముగ్గుల పోటీలు, గాలి పటాలు, మోహందీ, చిన్నారుల చే విచిత్ర వేషధారణ వంటి పోటీలు విద్యార్థులతో నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కాలేజీ ప్రిన్సిపల్ కెఎన్‌వి రామ్‌కుమార్ దంపతులను సత్కరించారు.

పెనుమంట్ర : మండలంలోని పెనుమంట్ర విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మార్టేరు వివేకానంద స్కూల్, వెలగలేరు విద్యార్థి, సంఘమిత్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. టీచర్స్ ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అక్కట్టుకొంది.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గర్భిణులు పోషకాహారం తీసుకుని తమ ఆరోగ్య పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. గురువారం స్థానిక పిహెచ్‌సిలో జరిగిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పోషకాహారంతోపాటు ఐరన్, కాల్షియం మాత్రలు వాడాలన్నారు. ప్రతి నెలా 9, 10 తేదీల్లో పిహెచ్‌సిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. అనంతరం 74 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి ఒ.జాలాది విల్సన్ బాబు, హెచ్‌వి సిహెచ్.పద్మజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్ల : కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని గర్భిణులకు డాక్టర్ సరాబు సునీల్, డాక్టర్ సునీత ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. శ్రీదత్త పాదుక క్షేత్రం ఎస్‌డిహెచ్‌ఎస్ వాలంటీర్ తరపున కాళ్ల గ్రామ టీం లీడర్ పివి.నాగేశ్వరరావు సౌజన్యంతో గర్భిణులకు, రోగులకు 70 మందికి పౌష్టికాహారంతో కూడిన భోజనాలు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దేవుని సన్నిధి సహవాసం కువైట్ వారి ఆధ్వర్యంలో గునుపూడి సుశీల రాపాక గణపతి వారి సహకారంతో రోగులకు, గర్భిణులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - నరసాపురం

మల్లవరం గ్రామంలో గురువారం భూముల రీసర్వేపై రెవెన్యూ శాఖ అవగాహనా ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీని తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి ప్రారంభించారు. అనంతరం అవగాహనా సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రతి రోజూ 20 ఎకరాల చొప్పున భూములను రీసర్వే చేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సంది సుజాత, నర్సింహారావు, పులకండం వీరరాఘవులు, ఆర్ఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులు తెలిపేందుకే వాతావరణ శాఖ

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రకృతి విపత్తులను ప్రజలకు తెలియజేసేందుకు వాతావరణ శాఖ పనిచేస్తోందని ఆ శాఖ పరిశీలన అధికారి బండి శ్రీకాంత్ అన్నారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో వాతావరణ శాఖ 150వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అకించన్ కుమార్, యు.బ్రహ్మానందం, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఆకివీడు :కోడిపందేలు, జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు చెప్పారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సభలో తహశీల్దార్ మాట్లాడారు. జూదక్రీడలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని పాటించకుండా ఎవరైనా క్రీడలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ జూదాలకు అలవాటు పడితే కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ఎవరూ జూదాల జోలికి పోవొద్దని నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్ సూచించారు.

ఉండి : జూద క్రీడలు వద్దు, సాంప్రదాయ క్రీడలు ముద్దు అంటూ మండల వ్యాప్తంగా ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా అవగాహనా సదస్సులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆచంట:ఈ నెల 10వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ మండలంలో కొత్త విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధుకుమార్ విజ్ఞప్తిచేశారు. 11 కెవి ఆచంట టౌన్, పెదమల్లం ఆచంట వేమవరం పీడర్స్ కొత్త విద్యుత్ లైన్ నిర్వహణ, సబ్‌స్టేషన్ మెయింటినెన్స్, చెట్ల కొమ్మల ఆకులు తొలగింపు కారణంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని విశ్రాంతి ప్రొఫెసర్ డాక్టర్ కె వి సుబ్బరాజు విద్యార్థులకు సూచించారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య వర్షిని ప్రశ్న ఆధ్వర్యంలో గురువారం మోటివేషన్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కెవిఎస్ఎన్.రాజు విశ్రాంతి వైస్ ప్రిన్సిపల్ వెంకటపతిరాజు పాల్గొన్నారు

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజల్లో జనసేనకు ఆదరణ పెరుగుతోందని దానికి నిదర్శనం పార్టీలో చేరికలేనని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. ముత్యాలపల్లిలో గురువారం గ్రామానికి చెందిన చెన్నూరి శివాజీ, లిఖిత్, నిషిత్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలోకి స్వచ్ఛందంగా చేరారు. వారికి నాయకర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న ముగ్గురు అరెస్ట్

భీమవరం టౌన్:స్థానిక ఎస్ఆర్‌కెఆర్ కళాశాల సమీపంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి 25 లీటర్ల మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సిఐ కె.బలరాంరాజు తెలిపారు. కళాశాల సమీపంలో కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, వనపర్తి వెంకటేశ్వరరావు, కంచిస్తంభం కాళేశ్వరరావు మద్యం అమ్ముతుండగా అదుపులోకి తీసుకుని మద్యం స్వాధీనం చేసుకున్నారు.

కొనసాగిన పింఛన్ల పరిశీలన

నరసాపురం:పలు గ్రామాల్లో ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ స్వరూప్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని రుస్తుంబాద, ఎల్‌బిచర్ల, తూర్పుతాళ్లు గ్రామాల్లో పెన్షన్ తనిఖీలు నిర్వహించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పరిశీలించారు. సర్టిఫికెట్లో పొందుపర్చిన విధంగా వారికి వైకల్యం ఉందా, లేదా అనే విషయాన్ని నిర్ధారించారు.

జూద క్రీడలు ఆడితే చర్యలు : సిఐ

తాడేపల్లిగూడెం:సంక్రాంతి సంబరాల పేరుతో పేకాట, గుండాట ఇతర జూదాలు నిర్వహించినా, ఆడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆటోకు ఇరువైపులా బ్యానర్లు కట్టి ప్రచారం చేయిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా వీటికి బదులుగా మానసికోల్లాసాన్ని కలిగించే క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు.

తిరుపతి ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

తాడేపల్లిగూడెం:తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చి టిక్కెట్లు కోసం జరిగిన తొక్కిసలాటలో యాత్రికులు మృతి చెందడంపై మాజీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వైసిపి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తిరుపతిలో జరిగిన ఘటన అత్యంత దారుణమన్నారు. ఇలాంటి ఘటన చరిత్రలోనే లేదని తెలిపారు. దీనికి ఆలయ పాలకవర్గం, కూటమి ప్రభుత్వం వైఫల్యమే కారణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, తిరుపతి ఇఒ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఆచంట:తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లో జరిగిన తొక్కిసలాటలో యాత్రికులు ప్రాణాలు కోల్పోయారని, ఈ దారుణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, వెంటనే టిటిడి ఛైర్మన్ రాజీనామా చేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వంపై, జగన్మోహన్ రెడ్డిపై లేనిపోని నిందలు వేసి బురదజల్లిన కూటమి ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

CHANGE OF NAME

I, IBBA JESURANI W/o. Karnati venkata Srinu and **Residing at D.No. 14-8-8,** 25th ward Doralaveedhi, Yagarlapalli,**TADEPALLIGUDEM** Phone No. 8333996688 Changing my Name from **RANI KARNATI ,** (OLD NAME) to **IBBA JESURANI** W/o. Karnati Venkata Srinu (NEW NAME) Hence forth I am being called as **IBBA JESURANI** (NEW NAME) for all purposes.

CHANGE OF NAME

I, **SADANALA RAJESWARI** W/o. Sadanala Nageswara Rao D.No. 17-1-192/7, Kottapallivari Street, Rustumbada, Narsapuram, W.G.Dt. A.P. I have changed my name from **SADANALA RAJASREE** (Old name) to **SADANALA RAJESWARI** (New name) hence forth I am being called **SADANALA RAJESWARI** W/o. Sadanala Nageswara Rao for all purposes.

ప్రకటన

నా క్లయింటు దివ్యజ్ఞాన విద్యా సమితి (రి.నెం.12/1946), అశోక్‌నగర్, ఏలూరు యొక్క ప్రెసిడెంట్ అయిన శ్రీ వేణుగోపాల్ లునాని గారు ఇచ్చిన సమాచారం మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా - సదరు దివ్యజ్ఞాన విద్యాసమితి వారి యొక్క ఆస్తులు క్రయం చేయుటకు గాని, క్రొత్తగా కొనుగోలు చేయుటకు గాని, బైలాను సవరించుటకు ది.16-10-2024న ఏకగ్రీవ తీర్మానం యావన్మంది సభ్యులు చేసియున్నారు. సదరు తీర్మానం ప్రకారం బైలాను పొందుపరచుటకు ఏలూరు జిల్లా రిజిస్ట్రారు వారికి విన్నపము చేసియున్నారు. సదరు విషయమై అభ్యంతరముయున్న సభ్యులు క్రింద తెలియపరచిన వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయగోర్తాము.

శేశెట్టి అప్పారావు, అడ్వకేటు, ఏలూరు.
సెల్: 8341885888

డాక్యుమెంట్ పోయినది

యలమంచిలి మండలం, మేడపాడుకు చెందిన యాడేపల్లి వెంకట రమేష్, తండ్రి: వెంకటేశ్వరరావు, డోర్ నెంబర్ 1-183 బహిరంగంగా తెలుపునది ఏమనగా మా కుటుంబానికి చెందిన స్థలం డాక్యుమెంట్ మా నానమ్మ యాడేపల్లి దమయంతి భర్త రామస్వామి ద్వారా మాకు సంక్రమించిన ఆస్థి డాక్యుమెంట్ నెంబర్ 6182/2005 నెంబర్ గల డాక్యుమెంట్ ది.26-12-2005లో పాలకొల్లు సబ్ రిజిస్టర్ ఆఫీసులో రిజిస్టర్ అయింది. దీనిని మా కుటుంబం అనుభవిస్తున్నాం. మా తండ్రి 2011లో మృతి చెందారు. దీనిని 14-5-2024న **డాక్యుమెంట్ నెంబర్ 9460/2024 గా** నకలు ద్వారా నా పేరు న ఆస్థి వచ్చింది. ఈ డాక్యుమెంట్ ను ది. 30-12-2024 న జిరాక్స్ తీయుటకు మేడపాటు లోని మా ఇంటి నుంచి గ్రామ సెంటర్‌లోని జెరాక్స్ సెంటర్‌కు వెళ్ళుతుండగా దారిలో పడిపోయింది. ఎంత వెతికినా నా ఒరిజినల్ డాక్యుమెంట్స్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికినా వీటిని మాకు అందజేయవలసినదిగా కోరి ప్రార్థిస్తున్నాను.

సెల్: 91602 00233

ఏలూరు నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి. నెం. 4041/2024-ఎ -1 తేది. 06-01-2025

బహిరంగ ప్రకటన

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో గల ఈ దిగువ ఉదహరించిన వివిధ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఖాళీగా ఉన్న షాపు రూములు ఇహిరంగవేలము ద్వారా కేటాయించుటకుగాను ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 56, తేది.05-02-2011 మరియు ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 198, తేది.08-05-2012 నందలి నిబంధనలు మరియు పశ్చిమగోదావరి జిల్లా గెజిట్ సప్లిమెంటు సంఖ్య 76, తేది.23-08-2014 ప్రకారము ది. 22-01-2025 బుధవారం ఉదయం గం. 11-00 నుండి ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయము ఆవరణ యందు స్టీల్డ్ టెండర్ కమ్ పబ్లిక్ ఆక్షన్ నిర్వహించబడును.

అద్దె ప్రాతిపదికపై కేటాయించుటకు:

1. వంగాయగూడెం చేపల చెట్టు మార్కెట్-8, 2. బాపూజీ కాంప్లెక్స్-3, 3. కందుల సూర్యం కాంప్లెక్స్-FF-1, 4. పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు North FF-3, 5.పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు South GF-1, 6.పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు South FF-5, 7.పాండురంగా కాంప్లెక్స్ 'B' బ్లాకు South GF-7, 8.క్యాటిల్ డిపో FF-8, 9.కస్తూరిబా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్-2-3, 10. మెయిన్ రోడ్ షాపింగ్ కాంప్లెర్స్-1, 11. మెయిన్ ఫిష్ మార్కెట్-22, 12. గజ్జలవారి చెరువు బుద్ధా పార్క్-22, 13. ఆదివారపు పేట్ మార్కెట్ కాంప్లెక్స్-4,16 (SC) 14. చోడిదిబ్బ కాంప్లెక్స్-1, 15. ASR C బ్లాక్ GF-4, 16. ఆనంద్ కుమార్ కాంప్లెక్స్-1, 17. న్యూ ఫిష్ మార్కెట్-12, సీల్డ్ టెండర్స్ కోరడమైనది. DEO Complex-2 షాపులను బహిరంగావేలము నిర్వహించబడును. నగరపాలక సంస్థ వారు షాపుల వారీగా నిర్వయించిన సాంవత్సరిక అద్దెపై 10 శాతము ధరవత్తుగా చెల్లించవలయును. సాల్వెన్సీ-రూ.1,00,000/- ,

గుడ్ విల్ పద్ధతిపై కేటాయించుటకు:

1. ఆదివారపు పేట్ మార్కెట్ కాంప్లెక్స్-13, గుడ్ విల్ రూ. 25,000/-, 2. లావేటి అప్పల స్వామి మార్కెట్-14, గుడ్ విల్ రూ. 25,000/- సాల్వెన్సీ-రూ.1,00,000/-, 3. మెయిన్ పిష్ మార్కెట్-1, గుడ్ విల్ రూ. 1,45,000/-, రూ.1,00,000/-, మెయిన్ పిష్ మార్కెట్-1, సాల్వెన్సీ-రూ.1,50,000/- గుడ్ విల్ రూ. 1,00,000/-

ఇతర వివరములకు ఆఫీసు పని వేళలలో అడిగి తెలుసుకోనగలరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 7013187783, 9849907144, 9492974794.

సం/- **కమిషనరు,** ఏలూరు నగరపాలక సంస్థ